


# కాలమ్ దాటని కబుర్లు

## బలభద్రపాత్రుని రమణి



## నెల నెలకీ కొన్ని కులాసా కులాసా కబుర్లు

### సందానీ కో నూలు పోగు!

**మా సందానీగాడు** తొండి చెయ్యకుండా ఏ ఆటా ఆడేవాడు కాడు. "చోర్ పోలీస్ ఆడదామా ఏ.వీ.రమణీ?" అంటూ వచ్చేవాడా వన్, టూ, త్రీ, సిక్స్‌టీన్, ట్వంటీ త్రీ ఫార్టీ, అంటూ లెక్క పెడ్తూ నైన్టీ, నైన్టీఫైవ్, నైన్టీసిక్స్, నైన్టీ సెవన్‌కి వెళ్ళిపోయేవాడు. అలాగే చింతపిక్కలు ఎగరేసి పట్టుకుంటున్నా సరే "అదిగో మీ అమ్మమ్మ వస్తున్నాయ్" అని వాడు అనగానే నేను అటు చూసేసరికి ఓ పురిషెడు తన వేనకేసుకునేవాడు. జెస్సీ డేవిడ్ సార్‌కైనా, నీలకంఠశాస్త్రికైనా సరే, వీడు లంచ్‌టైములో తను ఇంటికెళ్ళి క్యారేజ్ తెస్తానన్నాడంటే అందులో ప్రతి గిన్నె తీసి రుచి చూడకుండా తేడని నా అనుమానం.. ఎందుకంటే "హిందీ పండిట్‌కీ పెళ్ళాం చింతపండు ఎక్కువేస్తయ్ తొక్కులో.. ఆ జెస్సీ సార్ పెళ్ళాం కారం ఎక్కువేస్తయి" అనేవాడు క్యారేజీలు ఇచ్చి వచ్చి.

ఓసారి వీడు మా పంతులు గారబ్బాయి గణపతితో కలిసి ఎక్కడో భోక్తగా వెళ్ళాడుట. పొట్లాల దారం తీసుకొచ్చి నన్ను మెడలోకి జంధ్యం చేసి ఇవ్వమన్నాడు. చాక్‌పీస్‌తో పంగనామాలు పెట్టేసుకున్నాడు. వాడి భాషలో ఏ హైదరా స్వాహా.. గోల్కొండాయా స్వాహా.. చార్మినారాయనః అని ఏవో మంత్రాలు ప్రాక్టీస్ చేస్తూ "నాటికలోకి సితార్‌మియా కళ్యాణానికి" అన్నాడు.

"అది సితార్‌మియా కాదు... సీతారామ కళ్యాణం" అన్నాను.

కానీ వాడు గణపతితో కలిసి ఎవరింటికో భోక్తగా వెళ్ళి బాగా గారెలూ, పరవాణ్ణం అన్నీ తిని "షుక్రియా" అన్నాడనీ, వాళ్ళు నిజం తెలిసి చావగొట్టారనీ నాకు సుబ్బులు చెప్పింది.

సుబ్బులుకి సందానీగాడంటే ఒళ్ళుమంట. ఒకసారి దాన్ని 'బినా లైట్ కీ సైకిల్ లెక్క నువ్వు వెనకకి పోతున్నవో, ముందుకి పోతున్నవో తెలియదే" అన్నాడట. దానికి చాలా కోపం వచ్చింది "ఇలా అంటే అర్థం ఏవిటే?" అని భవానీని అడిగితే, నువ్వు వెనక నుండీ ముందు నుండీ ఒకేలా వుంటావనీ" అని చెప్పేసింది భవాని.

సుబ్బులుకి గొప్ప అవమానం అయిపోయింది. వీడి పొట్లాల దారాల బ్రాహ్మడి వేషం స్కూలు మొత్తం, మురికి కాలవ వాసనలా గుప్పుమని పోయింది.

రంగనాథం మేష్టారు పిలిచి సందానీని "ఏరా నిజమేనా?" అని అడిగాడు.

"ఆకలయింది సార్. జెస్సీ సార్, శాస్త్రి సార్ క్యారేజీలు వాళ్ళే తెచ్చుకుంటున్నాయి" అన్నాడు.

"వాళ్ళు ఏవైనా కుక్కపిల్లల్రా తెచ్చుకుంటున్నాయి అంటావ్" అని రంగనాథం సార్ ఘొల్లుమని నవ్వి "అమ్మీ జాన్ అన్నం పెట్టడం లేదా?" అన్నాడు.

"అదంతా పెద్ద కత సార్" అని సందానీ కింద కూర్చుని, ముక్కు మీద వాలిన ఈగని టప్పుమని కొట్టుకుని నాకే తిననీకి లేదంటే, ఇది నా ముక్కు నాకుతాయి. తెరీ" అని ఓ బూతు మింగేసి మాఫ్ కరో సార్" అన్నాడు

"సరే మీ అమ్మ అన్నం ఎందుకు వండటంలేదో పెద్ద కథ అన్నావ్? చెప్పు ముందు" అన్నాడు.

సందానీ సర్దుకుని కూర్చుని "మీకీ షేక్ హుస్సేన్ తెలుసా?" అన్నాడు.

"తెలుసు.. ఆ నాలుగో తరగతిలో వుంటాడు వాడేనా?"

"ఏహె .. కాదు తీ.. నవార్ అమ్ముతాయ్. టింగ్ టింగ్ మని ఇంటిముందుకచ్చి" అన్నాడు.

"ఓ.. ఆ షేక్ హుస్సేనా?" అన్నాడు సార్.

"ఆయన కాదు అని చెప్పనీకే అడిగినా ఇంకో షేక్ హుస్సేన్. పిండి గిర్నీల పని చేస్తాయ్.."

"ఓ.. ఆ హుస్సేనా?" ఉషారుగా అన్నాడాయన.

"కాదేహే! ఆయన అనుకుంటావేమో కాదని చెప్పనీకే అడిగినా. ఈ షేక్ హుస్సేన్ మా నాయనతోని కరెంట్ స్థంభం ఎక్కుతయ్ చూడు"

"ఆయనా కాడుగా" నీరసంగా అన్నాడు సార్.

"నీకీ దమాక్‌ల కూడా పేనులున్నాయా సార్. ఆ షేక్ హుస్సేనే. ఆ హుస్సేన్ కీ ఓ బహెన్ వున్నయే" అన్నాడు సందానీ.

చాక్ పీస్‌లు డబ్బాలోంచి కొట్టెయ్యడానికొచ్చి, కిటికీ దగ్గర నిలబడ్డ నేను ఆసక్తిగా వింటున్నా.

"ఆ హుస్సేన్‌కి ఓ చెల్లుందా?"

"అయితే?" అడిగాడు ఆవలిస్తూ సార్.

"ఆ హుస్సేన్ కి నాలుగు చెల్లిల్లున్నాయ్" సందానీగాడు మూడు వేళ్ళు చూపించాడు, నేను కిటికీలోంచి ఇంకో వేలు చూపించమని సైగచేసా. వీడు మూడు మూసి చిటికెన వేలు చూపించాడు.

రంగనాథం మేస్టారు "చప్పున కథ చెప్పి అప్పుడెళ్ళు ఒంటేలుకి" అన్నాడు.

"ఒంటి వేలు, జోడీ వేలు కాదు సార్. హుస్సేన్‌కి నాలుగో బహెన్ వహీదా వున్నాయ్. ఆమెకి మిషిన్ తొక్కడం వచ్చు. అంటే గిర్నీల మిషన్ కాదు. కుట్టు మిషన్. అట్ల మిషన్ తొక్కి తొక్కి ఒక కాలు ఇరిగిపోయినయి సార్" అన్నాడు బాధగా.

సార్ విసుగ్గా "ఆ వహీదాకి కాలు విరిగిపోతే నీకేమయిందిరా? మీ ఇంట్లో అన్నం ఎందుకు వండటంలేదూ?" అన్నాడు.

"నాకీ నాయినా లుచ్చా వున్నయ్ సార్" అన్నాడు వాడు.

"తప్పురా!" సార్ చెంపలేసుకున్నాడు, "తండ్రిని అట్లా అనకూడదు కళ్ళుపోతాయి"

సందానీ నవ్వి "ప్రహ్లాదుడు ఈ మాట అనలేదు గానీ, సింగం సామిని పిలిచి మా నాయనకి డొక్క చించి డోలు కట్టు అనలేదా? హరికతలో నేను విన్నయ్ సార్" అని నవ్వాడు.

"నాయిన ఫాల్తూ లెక్కలు చేస్తే మరి ఏం అనాలి సార్? ఆ షేక్ హుస్సేన్‌కి తీసుకుపోయి సారా పోయించి, వహీదా మిషిన్ తొక్కే షాప్‌ల పోయి కూసుంటున్నయి నాదీ నాయినా. తనఖారోజు పైసలన్నీ ఎత్కపోయి వహీదాకి చమ్కీల చోళీ ముక్కుకి కమ్మలు, చెవులకి బులాకీ చేయిస్తున్నాడు" ఆవేశంగా అన్నాడు.

రంగనాథం సార్ "ఒరే సన్నాసీ! ముక్కుకి బులాకీ, చెవులకి కమ్మలు రా" అన్నాడు నవ్వి.

సందానీకి కోపం వచ్చింది "ఒక దిక్కు మా కొంప కూలుతుంటే నీకీ బులాకీ ఎక్కడ పెట్టాలీ, కమ్మలు ఎక్కడ పెట్టాలీ అవసరమా? నేను చెప్పను సార్" అన్నాడు.

రంగనాథం సార్ ఆకు తీసి నిలువుగా చీలుస్తూ "చెప్పరా నీ ఇష్టం వచ్చిన చోట పెట్టుకో బులాకీ" అన్నాడు. ఆకులో కాస్త కాసు వక్కా, డబ్బాలోంచి తీసి వేస్తూ.

"అమ్మీ జాన్‌కి ఈ సంగతి ఎరుకైంది. చిన్నమ్మ తానకి పోయి చెప్పింది సార్" అన్నాడు.

"చిన్నమ్మ ఎవరూ?" సార్ అడిగాడు.

"నాదీ నాయనదీ చిన్న పెళ్ళాం వున్నాయ్ సార్" అన్నాడు చిరాగ్గా సందానీ.

సార్‌కి ఉత్సాహం వచ్చింది. "ఓరి అమీరూ నీకు ఇద్దరు పెళ్ళాలా?" అని ముందుకి ఒంగి "అప్పుడేమయిందీ?" అన్నాడు.

"అమ్మీజాన్, చిన్నమ్మా కలిసి వహీదా కుట్టుమిషన్ తానకి పోయినయ్. వహీదాకి జడ పట్టిలేపి, ఇద్దరూ డిషుం డిషుం కొట్టినయ్" అని ఆపాడు.

"తర్వాతా?" అడిగాడు సార్.

"ఆకలైతోంది సార్" అన్నాడు సందానీ.

"ఇప్పుడేగా తద్దినంలో మింగొచ్చావ్" అని సార్ "ఇదిగో పావలా తీసుకెళ్ళి అరటిపండు కొనుక్కో" అని, సందానీ అది తీసుకుని లేస్తుంటే రెక్క పట్టి ఆపి "వహీదా ఏమందో చెప్పి అప్పుడు వెళ్ళు" అన్నాడు.

"ఏమంటయి సార్? నీదీ మగడు నా దగ్గర కొచ్చినయ్. నేనూ నీ ఇంటికి వచ్చినానా? నాకు కొడ్తాయి ఎందుకు?" అని ఏడ్చింది సార్" అన్నాడు.

"అప్పుడొదిలేసారా మీ అమ్మావాళ్ళు"

"లేద్సార్. ఇంకా కొట్టినయ్. అప్పుడు మా అబ్బాజాన్ వచ్చినయ్"

"వచ్చాడా? ఏమన్నాడూ?"

"అది నా మూడో బీవీ. నేను లగ్గం చేస్కుంటాయి. ఎక్కువ మాట్లాడితే మీ ఇద్దరికీ తలాక్ తలాక్ ఇస్తాయ్" అన్నాడు సార్.

రంగనాథం సార్ నోరు తెరిచేసాడు "ఓరి అమీరూ ఎంత ధైర్యంరా. ఒకరు కాదు, ఇద్దరు భార్యలుండగా, మూడో పెళ్ళాం కావల్సొచ్చిందా? ఏం పెట్టి పోషిద్దామనిరా?" అని ఆశ్చర్యంగా చూసాడు.

"ఆ దినం నుండి నాకీ అమ్మీజాన్ అన్నం వండుతలేదు సార్. చిన్నమ్మ కూడా" అన్నాడు.

"మరి వాళ్ళేం తింటున్నారూ?" అడిగాడు రంగనాథం సార్.

"తన్నులు" తాపీగా చెప్పాడు సందానీ.

"మరి మీ నాన్న వహీదాని పెళ్ళి చేసేసుకున్నాడా?" అడిగాడు సార్.

సందానీ తల అడ్డంగా వూపి "నడుముకి నాగారం తెస్తేకానీ లగ్గం చేసుకోనంది వహీదా" అన్నాడు.

"నడుముకి నాగారం కాదురా వడ్డాణం పెట్టాలి" అన్నాడు రంగనాథం సార్ ఏమీ తెలీదు అని సణుగుతూ.

"నీకు తెలిస్తే నువ్వే చేయించు సార్ వడ్డాణం" చిరాకుపడ్డాడు సందానీ.

"అందుకని మీకు అన్నం పెట్టకపోతే ఎలారా?" ఇంకో ఆకు చీలుస్తూ అన్నాడాయన.

"దినాం వహీదాని తెచ్చి ఒప్పించి తనకి నిఖా చెయ్యమని నాదీ నాయినా లొల్లి సార్. అమ్మీజాన్‌కి కొడ్తున్నయ్" అన్నాడు సందానీ బాధగా. ఏ మాటకా మాట వాడికి అమ్మీజాన్ అంటే ప్రాణం. వాళ్ళ నాన్న కొడ్తుంటే వీడు అడ్డం వెళ్ళి చాలా దెబ్బలు తింటుంటాడు.

"మరి మీ అమ్మీజాన్ ఒప్పుకుందా?" అడిగాడాయన.

"ఏం చేస్తది సార్. దెబ్బలు తినలేక సరేనన్నాయి"

"ఆ? మూడో పెళ్ళా అయితే మీ నాయనకి?" సార్ ఉషారుగా అన్నాడు.

"ఈ లోగా నేను నిచ్చెన తీసేస్నా సార్" సందానీ పావలా బిళ్ళతో ఆడ్తూ అన్నాడు.

"నిచ్చెన ఏవిట్రా?" అన్నాడాయన.

"కరెంట్ పని చెయ్యనీకి కరెంట్ పోల్ ఎక్కిండు నాదీ నాయినా. నేను కింద నిచ్చెన తీసేసినా సార్. అబ్బాజాన్ "ఒరే హౌలా" అని అరిచిండు సార్. అది విని షేక్ హుస్సేన్, వైర్ కలిపిండు సార్, కరెంట్ పాస్ అయింది సార్"

"మరి మీ నాన్నా?"

"షాక్ కొడ్తుందని, ఎగిరి కిందకి దూకిండు సార్"

"కాలు విరిగిందా?"

"మూడు కాళ్ళు వచ్చినయ్ సార్"

"మూడోకాలా?"

"సంకల కింది కర్ర సార్" సందానీ నవ్వాడు.

"అప్పుడేమయింది మరీ?"

"షాదీ ఆగిపోయింది సార్. మూడు కాళ్ళ ముసలాడిని చేసుకోనంది వహీదా"

"పీడా పోయింది"

"కొలువు కూడా పోయింది సార్. అబ్బాజాన్ నౌకరీ పోయాకా, అన్నం వండనీకి ఇంట్ల బియ్యం లేవు సార్. అందుకే గణపతి నాతో రారా నీకు మస్తు పప్పు, అప్పలు పెట్టిస్తా అంటే మెడల దారం వేసుకుని పోయినా సార్" అన్నాడు చేతులు కట్టుకుని, సార్ కళ్ళల్లోకి చూస్తూ.

ఆకలి ఎంత పనైనా చేయిస్తుందని తెలిసిన రంగనాథం మాస్టారు "ఇటురా రా" అన్నాడు.

"గోడ కుర్చీకా సార్?" అడిగాడు సందానీ.

ఆయన జేబులోంచి అయిదు రూపాయల కాయితం తీసిస్తూ "ఇంద బియ్యం కొనుక్కెళ్ళు ఇంటికి" అన్నాడు. ఇదంతా నా చిన్నతనంలో నాకూ, సందానీకి పదేళ్ళ వయసున్నప్పుడు జరిగిన సంగతి.

ఆకలి అబద్ధం ఆడిస్తుంది.

ఆకలి తెగింపు నిస్తుంది.

శ్రాద్ధాలూ, విందులూ, వినోదాలూ అని బోలెడంత వండించి, అక్కర్లేని వాళ్ళకి బలవంతం చేసి ఆకులనిండా వడ్డిస్తే, వాళ్ళు నిర్మొహమాటంగా వదిలేసి పోతుంటే, ఆకలితో నిలబడ్డ సందానీలాంటి పిల్లలు ఇప్పటికీ నా కళ్ళల్లో మెదుల్తారు.

నేను చాకోపీసు, సందానీగాడు అరటిపండు తింటూ ఇంటికొస్తుంటే నేను అడిగాను "మీ అమ్మ నిన్ను మెచ్చుకుందా మీ అబ్బా జాన్ కాలు విరగ్గొట్టావనీ?" అని.


"అమ్మీ జాన్ ఇంకా రెండు గంటలు ఎక్కువ బీడీలు చుడుతుంది. చిన్నమ్మ మిరపకాయల బండి పెట్టి అమ్ముతుంది. అబ్బా జాన్‌కి నౌకరీ పోయిందిగా"

"మరి.. మరి అబ్బాజాన్ ఏం అంటున్నాడు?"

"నాకు వహీదాని తెచ్చి లగ్గం చేస్తే, అది మిషన్ కుట్టి మీ ఇద్దరికీ సాయం చేసేది. మీరే పాడు చేసుకున్నారు చేతికొచ్చే డబ్బులు" అని మంచం మీద కూర్చుని మిరపకాయ బజ్జీలు తింటూ సారా తాగుతున్నాడు" అన్నాడు.

ఇంతకీ సందానీ చేసిన పనివల్ల శిక్ష ఎవరికీ? లీలావతేం చేసిందని నరసింహస్వామి ఆవిడ తాడు తెంచేసినట్లూ? తరతరాలుగా ఆడజాతికేనా శిక్ష?

Post your comments










https://www.youtube.com/watch?v=ERaaX_IulS4